మార్చిలోగా 'వారందరికీ' రూ.1000

- అసెంబ్లీలో ఉదయనిధి ప్రకటన

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న గృహిణులందరికీ మార్చిలోగా రూ.1000 చెల్లించనున్నట్లు బుధవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ఉదయనిధి సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో వేడచందూరు ఎమ్మెల్యే గాంధీరాజన్ దిండుగల్ జిల్లాల్లో కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద లబ్ధిపొంద నున్న గృహిణుల సంఖ్య వెల్లడించాలని కోరారు. ప్రత్యేక పథకాల మంత్రిత్వ శాఖ కూడా నిర్వర్తిస్తున్న డిప్యూటీ సీఎం సమాధానమిస్తూ... దిండుగల్ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 5లక్షల 27 మందికిగాను 4లక్షల 897 మందికి ప్రతినెలా రూ.1000లను చెల్లిస్తున్నట్లు తెలిపారు. వేడచందూరు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా 62 వేలమంది గృహిణులు లబ్ధిపొందుతున్నారని, ఇక రాష్ట్రమంతటా కోటి 63లక్షల 57వేల 195 మంది దరఖాస్తు చేయగా, వాటిలో కోటి 6 లక్షల 52 వేల 198 మందికి నగదు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో కొత్తగా దరఖాస్తు చేసిన గృహిణులకు కూడా వచ్చే మార్చిలోపున ప్రతి నెలా రూ.1000లను చెల్లించనున్నామని తెలిపారు.



అసెంబ్లీలో సావధాన తీర్మానంపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఎవరినీ వదలం

అత్యాచారం కేసులో దోషులు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదు

అసెంబ్లీలో సీఎం స్టాలిన్ హెచ్చరిక

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న నిందితుడితో పాటు ఇంకెవరికైనా సంబంధం ఉంటే, ఆ వ్యక్తులు ఎంతటివారైనా సరే, కఠిన శిక్ష పడేలా చేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారు. అసెంబ్లీలో బుధవారం అన్నా వర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారం ఘటనపై అన్నాడీఎంకే, డీపీఐ ప్రతిపాదించిన సావధాన తీర్మానానికి బదులు చెబుతూ స్టాలిన్ గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పొల్లాచ్చి వద్ద జరిగిన అత్యాచారం కేసుల్లో నిందితులంతా ఆ పార్టీ వారేనని సీబీఐ దర్యాప్తులో తేలిన విషయాన్ని ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి మరచిపోయారన్నారు. అన్నా విశ్వవిద్యాలయం విద్యార్థినిపై అత్యాచారం పట్ల గగ్గోలు పెడుతున్న ఈపీఎస్ నల్ల చొక్కాలు, ఎవరా సార్ అంటూ ముద్రించిన బ్యాడ్జీలు కట్టుకుని తన హోదా తనకు తానే తగ్గించుకున్నారన్నారు. అన్నావర్సిటీ ఉదంతంపై సభ్యులు జగన్‌మూర్తి, వేల్ మురుగన్, ఈశ్వరన్, సదన్ తిరుమలై కుమార్, కె.మారిముత్తు, నాగై మాలి, చిందనై వేలన్, ఎంఆర్ గాంధీ, జీకే మణి, సెల్వపెరుంతగై, ఆర్బీ ఉదయకుమార్ తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం హర్షణీయమన్నారు. ఈ సభ్యుల్లో కొందరు అన్నావర్సిటీ ఉదంతంపై ప్రభుత్వంపై విమర్శలు కూడా చేశారని, మొత్తానికి బాధితురాలికి సభ్యులంతా అండగా నిలిచేలా ఉన్నాయని స్టాలిన్ చెప్పారు. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్టు చేయకపోవడం గాని, నిందితుడిని ప్రభుత్వం కాపాడేందుకు ప్రయత్నించి ఉంటే ప్రతిపక్షం విమర్శలు సబబుగా ఉండేవని, అయితే ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అరెస్టు చేశారని గుర్తు చేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ వెల్లడి కావటానికి జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ) కారణమని, ఇందులో ప్రభుత్వ ప్రమేయమే లేదని స్పష్టం చేశారు. అన్నావర్సిటీలో సీసీ కెమెరాలు పనిచేయడమే లేదనడం గర్హనీయమని, నిందితుడిని త్వరగా అరెస్టు చేయడానికి సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలే కారణమనే విషయాన్ని ప్రతిపక్ష నేతలు మరచిపోతున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. హైకోర్టు నియమించిన సిట్ కూడా అప్పటి వరకూ జరిగిన దర్యాప్తు సవ్యంగా జరిగినట్లు కితాబిచ్చిందన్నారు. అరెస్టయిన నిందితుడిపై గూండా చట్టం కూడా ప్రయోగించామన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో పొల్లాచ్చి యువతులపై, విద్యార్థినులపై జరిగిన అత్యాచారాలు దేశవ్యాప్తంగా కలకలం రేపాయని, నిందితులంతా అన్నాడీఎంకే సభ్యులేనని రాష్ట్ర పోలీసులు ప్రకటించలేదని, కేసు దర్యాప్తు చేసిన సీబీఐ ఉన్నతాధికారులే వెల్లడించారని స్టాలిన్ గుర్తు చేశారు. ఆ కేసులో ఎంతమంది సార్లు ఉన్నారో అప్పట్లో ప్రతిపక్షంగా వ్యవహరించిన తాను పాలకులపై ఒత్తిడి చేయలేదన్నారు. ఇకనైన ఈపీఎస్ బాధ్యతాయుతమైన ప్రతిపక్షనేతగా ఉన్నామనే విషయాన్ని గుర్తుపెట్టుకుని హుందాగా వ్యవహరించాలన్నారు.



ఐఎండీ 150వ వార్షికోత్సవం నమూనాలో విద్యార్థులు

వాతావరణశాఖకు 150 ఏళ్లు

- ఎవర్విన్ పాఠశాలలో వినూత్న ప్రదర్శన

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వర్షాల తిప్పలు, తుఫాను ముప్పుల గురించి నిత్యం మనల్ని హెచ్చరించి, అప్రమత్తం చేసే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 150వ వర్షంలోకి అడుగు పెట్టింది. ఈ వార్షిక వేడుకలు కొళత్తూర్‌లోని ఎవర్విన్ పాఠశాల ప్రాంగణంలో పాఠశాల యజమాన్యం, చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి.. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, ప్ల కార్డులతో అవగాహన నిర్వహించారు. ముందుగా భారత వాతావరణ పరిశోధన శాఖ రూపొందించిన ప్రత్యేక గీతానికి విద్యార్థులు నృత్యం చేశారు. వాతావరణం పర్యవేక్షించే ఉపకరణాలు, వెదర్ స్టేషన్ తదితరాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. అనంతరం సుమారు 400 మంది విద్యార్థులు వాతావరణ పరిశోధన కేంద్రం లోగోతో కూడిన టీ-షర్ట్, టోపీ ధరించి సుమారు కి.మీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఎస్.బాలచంద్రన్, ఎవర్విన్ పాఠశాలల గ్రూప్ సీఈఓ మహేశ్వరి, సీనియర్ ప్రిన్సిపాల్ పురుషోత్తమన్, డైరెక్టర్లు విద్య, మురళీకృష్ణ సహా పలువురు పాల్గొన్నారు.

సీఎం స్టాలిన్ చెప్పేవన్నీ అవాస్తవాలే

ప్రతిపక్ష ఉపనేత ఆర్‌బీ ఉదయ్‌కుమార్ - అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే వాకౌట్

ప్యారీస్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో అన్నాడీఎంకే గురించి ముఖ్యమంత్రి స్టాలిన్ అవాస్తవాలు చెబుతున్నారని ప్రతిపక్ష ఉపనేత ఆర్‌బీ ఉదయ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం ఉదయం అసెంబ్లీలో విద్యార్థినిపై అత్యాచార ఘటనకు సంబంధించి ప్రత్యేక సావధాన తీర్మానంపై చర్చ జరిగింది. ఇందులో అఖిల పక్షాల సభ్యులు వివిధ రకాల ప్రశ్నలు సంధించారు. వీరికి ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానం చెబుతూ.. ఈ వ్యవహారానికి సంబంధించి విపక్ష పార్టీలు ప్రభుత్వంపై నిందమోపడం సరికాదన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కోవై జిల్లా పొల్లాచ్చిలో మహిళలపై జరిగిన లైంగిక వేధింపులపై అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సీబీఐ దర్యాప్తులో పొల్లాచ్చి లైంగిక వేధింపు కేసులో అన్నాడీఎంకే ప్రముఖులకు సంబంధం ఉన్నట్లు తేలిందన్నారు. ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే నేతలు తీవ్రంగా ఖండించారు. సీనియర్ ఎమ్మెల్యేలు ఆర్‌బీ ఉదయ్‌కుమార్, పొల్లాచ్చి జయరామన్ సహా ఎమ్మెల్యేలంతా సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం వ్యాఖ్యలకు నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం అసెంబ్లీ వెలుపల ప్రతిపక్ష ఉపనేత ఆర్‌బీ ఉదయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో గతంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం గురించి అవాస్తవాలు మాట్లాడారని ఆరోపించారు. అన్నా వర్శిటీ విద్యార్థినికి జరిగిన అఘాయిత్యాన్ని మరుగుపరచే ప్రయత్నాలు చేపట్టారని, ఈ ఘటనను వ్యతిరేకిస్తూ రాష్ట్రవాప్తంగా ప్రజలే స్వచ్ఛందంగా బయటకు వచ్చి పోరాడుతున్నారని తెలిపారు.



అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

మూడో రోజూ నల్లచొక్కాలతోనే

- అసెంబ్లీకి అన్నాడీఎంకే సభ్యుల హాజరు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే శాసనసభ్యులు మూడోరోజూ శాసనసభ సమావేశాలకు నల్లచొక్కాలు ధరించి హాజరయ్యారు. ఆచొక్కా జేబులపై ఎవరా సార్ అనే బ్యాడ్జీలు తగిలించుకుని మరీ శాసనసభ సమావేశంలో పాల్గొన్నారు. అంతే కాకుండా 'టంగ్‌స్టన్ తవ్వకాలకు నిరసన' అని ముద్రించి ఉన్న మాస్కులను కూడా పెట్టుకుని సమావేశంలో పాల్గొన్నారు. కాగా అన్నాడీఎంకే సభాపక్ష నాయకుడు. మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి బుధవారం కూడా శాసనసభకు హాజరు కాలేదు.

ఇలగణేశన్ సోదరుడి కన్నుమూత





ఇలగోపాలన్ భౌతికకాయానికి సీఎం స్టాలిన్ నివాళి - ఇలగోపాలన్ (ఫైల్ ఫొటో)

అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగాలాండ్ గవర్నర్ ఇలగణేశన్ సోదరుడు ఇలగోపాలన్ అనారోగ్యం కారణంగా బుధవారం మృతి చెందగా, ఆయన భౌతికకాయానికి సీఎం స్టాలిన్ నివాళులర్పించారు. స్థానిక గోపాలపురంలో ఉన్న ఇల.గోపాలన్ నివాసానికి వెళ్లి అంజలి ఘటించి, కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. దివంగత కలైంజర్, తనపైనా ఎంతో ప్రేమాభిమానాలు చూపించే ఇల.గణేశన్‌కు కలిగిన దుఃఖాన్ని తాను కూడా పాలుపంచుకుంటున్నట్టు సీఎం విడుదల చేసిన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

గవర్నర్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం

- సభలో రాసిచ్చిన దానిని చదవటమే ఆయన పని
- ఎక్స్‌పేజీలో సందేశం అసెంబ్లీని అవమానించడమే
- వాకౌట్‌కు అన్నాడీఎంకే సభ్యులే కారణం
- స్పీకర్ అప్పావు ధ్వజం



చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం ఆరంభంలో ఏర్పాటైన మొదటి అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రవర్తించిన తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పీకర్ అప్పావు ధ్వజమెత్తారు. ఈ నెల 6న గవర్నర్ రవి ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని చదవకుండా వాకౌట్ చేయడం గర్హనీయమన్నారు. బుధవారం శాసనసభలో గవర్నర్ తీరుపై స్పీకర్ అప్పావు వివరణ ఇస్తూ సభ నుంచి గవర్నర్ వాకౌట్ చేయడానికి అన్నాడీఎంకే సభ్యులే ప్రధాన కారణమన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా అన్నాడీఎంకే సభ్యులు నల్లజెండాలతో, ప్లకార్డులతో వచ్చినందువల్లే సభ నుండి నిష్క్రమించారని తెలిపారు. ప్రభుత్వం అందించిన ప్రసంగ పాఠాన్ని చదవటం గవర్నర్ విధి అని, ఆ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఎలాంటివి కోరకూడదని స్పష్టం చేశారు. తన ప్రసంగానికి ముందు జాతీయగీతాన్ని ఆలపించాలని శాసనసభపై ఒత్తిడి చేసే అధికారం ఆయనకు లేదన్నారు. కాగా సభలో జరిగిన విషయాలను తప్పుబడుతూ గవర్నర్ తన ఎక్స్‌పేజీలో ప్రకటన చేయడం శాసనసభను కళంకపరచడమే అవుతుందని చెప్పారు. గవర్నర్ చర్యలన్నింటినీ రాష్ట్ర శాసనసభ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

దూరదర్శన్ ప్రసారం కోసం పట్టు..

తొలిరోజు అసెంబ్లీ కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసార బాధ్యతల్ని దూరదర్శన్ 'పొదిగై' టీవీ'కి అప్పగించాలని గవర్నర్ తనపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారని స్పీకర్ ఆరోపించారు. ఆరోజు ప్రత్యక్ష ప్రసారాన్ని పొదిగై టీవీకి అప్పగించి ఉంటే మార్పులు, చేర్పులు చేసి శాసనసభ పరువు దిగజార్చి ఉంటారని స్పీకర్ ఆరోపించారు. ఏది ఏమైనప్పటికీ గవర్నర్ రవి తన ప్రవర్తనతో రాష్ట్ర అసెంబ్లీని ఘోరంగా అవమానించారని స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు.

ప్రైవేటు బస్సుల్లో 'పొంగల్' దోపిడీ!

- చెన్నై నుంచి నెల్లైకు రూ.4 వేలు
- ఇష్టానుసారంగా ప్రైవేట్ ట్రావెల్స్

అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగను అడ్డుపెట్టుకుని ప్రైవేటు బస్సులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. పండుగ రద్దీని క్యాష్ చేసుకునేలా ఇష్టానుసారంగా చార్జీలను వసూలు చేస్తున్నాయి. చెన్నై - తిరునెల్వేలి మధ్య ఏకంగా రూ.4 వేలు చార్జీ వసూలు చేయడం గమనార్హం. దీనిని చూసిన ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా పొంగల్, దీపావళి పండుగలకు నగరవాసులు తమ సొంతూళ్లకు వెళ్తుంటారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులతో పాటు రైళ్ళన్నీ రద్దీతో నడుస్తున్నాయి. అయితే, ఈ రద్దీ సమయంలో ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ఇష్టానుసారంగా చార్జీలను వసూలు చేస్తుంటాయి. ఈ యేడాది పొంగల్ పండుగకు సొంతూర్లకు వెళ్ళేవారి కోసం ఈ నెల 10, 11, 12, 13వ తేదీల్లో రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అయితే, ప్రభుత్వ బస్సుల్లో రిజర్వేషన్లు ఫుల్ అవడంతో అనేక మంది ప్రైవేటు బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అధిక మొత్తంలో చార్జీ వసూలు చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన చెన్నై నుంచి మదురైకు రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. ఏసీ సీటింగ్ బస్సుల్లో రూ.3 వేలు, ఏసీ స్లీపర్ క్లాస్ బస్సుల్లో రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. చెన్నై నుంచి నెల్లైకు రూ.4 వేలు, చెన్నై - తూత్తుకుడికి మధ్య ఏసీ సీటింగ్ రూ.3 వేలు, స్లీపర్ రూ.4 వేలు వసూలు చేస్తున్నారు. తిరుచ్చికి రూ.2,500, తెన్‌కాశితో పాటు పలు ప్రాంతాలకు రూ.3వేలు కోయంబత్తూరు, పొల్లాచ్చి, తిరుప్పూరు ప్రాంతాలకు అయితే ఏకంగా రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో కేవలం రూ.1000 నుంచి రూ.1500 మాత్రమే వసూలు చేస్తుండగా, ఇపుడు మాత్రం రెట్టింపు చార్జీలను వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.



ఈరోడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటైన కంట్రోల్ రూమ్

ఈరోడ్ ఈస్ట్‌లో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్







ఈరోడ్‌లో మంగళవారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు - విగ్రహాలకు ముసుగులు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గానికి ఫిబ్రవరి 5న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో మంగళవారం సాయంత్రం నుండే ఆ ప్రాంతంలో ఉప ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయని జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి, జిల్లా కలెక్టర్ రాజగోపాల్ సుంకర తెలిపారు. ఈ నియోజకవర్గ ఉప ఎన్నికకు 237 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉప ఎన్నికకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించడానికి ఈరోడ్ కలెక్టర్ కార్యాలయం వద్ద, కార్పొరేషన్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉప ఎన్నిక నియమనిబంధనలు అమలు చేసేందుకు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు నిఘా బృందాలు, ఓ వీడియో సహిత నిఘా బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిఘా బృందం ఈ నెల 10 నుంచి తనిఖీలు చేస్తాయని చెప్పారు ఇదిలా ఉండగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుండే వాహనాల తనిఖీ ప్రారంభించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఓ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారి, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ వీడియోగ్రాఫర్ ఉంటారు. ఇకవాహనాల తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని ఎన్నికల అధికారి మనీష్ నియోజవర్గంలో పరిశీలనలు జరుపుతున్నారు.

సమాచార దృష్టి

'బుక్ ఎగ్జిబిషన్'ను పది లక్షల మంది సందర్శన

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో జరుగుతున్న బుక్ ఎగ్జిబిషన్‌ను 10 రోజుల్లో 10 లక్షల మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సంఖ్య గత ఏడాదితో పోల్చితే అధికమని, ఈ నెల 12వ తేది ఎగ్జిబిషన్‌కు చివరిరోజు అని వారు పేర్కొన్నారు.

29 నుంచి తపాలా స్టాంపుల ప్రదర్శన

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక షేనాయ్‌నగర్ కమ్యూనిటీ హాలులో తపాలా శాఖ ఆధ్వర్యంలో 14వ రాష్ట్రస్థాయి తపాలా స్టాంపుల ప్రదర్శన ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనను ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు వీక్షించవచ్చు. ప్రతిరోజు విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలో తాము సేకరించిన తపాలా స్టాంపులు ప్రదర్శనకు ఉంచేందుకు ఆసక్తి ఉన్న వారు గురువారంలోపు పేరు నమోదు చేసుకోవాల్సి ఉంది. అర్హత ఆధారంగా బంగారం, వెండి, కాంస్య పతకాలు అందించనున్నట్లు తపాలా శాఖ తెలియజేసింది.

1వ తేదీకి సైక్లింగ్ పోటీలు వాయిదా

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా 2024-25వ సంవత్సరానికి విద్యార్థులకు 'అన్నా సైక్లింగ్ పోటీలు' గురువారం జరుగుతున్నట్లు ఇదివరకే ప్రకటించారు. అనివార్య కారణాలతో ఈ పోటీలు ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదాపడ్డాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారు దేశీయంగా తయారైన సైకిళ్లు మాత్రమే వినియోగించాలి. ముందస్తు పేరు నమోదు లేకుండా నేరుగా పోటీలకు వచ్చే వారిని అనుమతించరు. ఆసక్తి కలిగిన వారు 7401703480 అనే నెంబరు సంప్రదించవచ్చు. అలాగే, శుక్రవారం నిర్వహించాల్సిన 'అన్నా మారథాన్' పోటీలు ఫిబ్రవరి 2వ తేది జరుగుతాయని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీసిద్ధార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జల్లికట్టు పోటీలు

12,632 ఎద్దులు, 5,347 మంది క్రీడాకారుల నమోదు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్ జల్లికట్టు పోటీల్లో పాల్గొనేందుకు 12,632 ఎద్దులు, 5,347 మంది క్రీడాకారులు పేర్లు నమోదుచేసుకున్నారు. జల్లికట్టు పోటీల్లో పాల్గొనే ఎద్దులు, క్రీడాకారుల పేర్ల నమోదు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ నెల 14న అవనియాపురం, 15న పాలమేడు, 16న అలంగానల్లూర్‌లో జల్లికట్టు పోటీలు జరుగనున్న విషయం తెలిసిందే.

26న గ్రామసభలు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 26న గ్రామ సభలు నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ పొన్నయ్యాన్ ఉత్తర్వులు జారీచేశారు. గ్రామసభ నిర్వహించే ప్రాంతం, సమయం తదితరాలతో కూడిన వివరాలు ప్రజలకు తెలియజేసి, పెద్దసంఖ్యలో ప్రజలు ఈ సభల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. మతపరమైన స్థలాల్లో సభలు నిర్వహించరాదన్నారు. ముఖ్యంగా, ప్రస్తుతం ప్రబలుతున్న అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

లగేజీ రాకపోవడంతో విమాన ప్రయాణికుల ఇక్కట్లు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కువైట్ నుంచి నగరానికి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో లగేజీ రాకపోవడంతో 248 మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నగరానికి చేరుకున్న విమానంలో 12 మంది ప్రయాణికుల లగేజీ మాత్రమే కన్వేయర్ బెల్ట్‌లో రావడం చూసి మిగిలిన ప్రయాణికులు దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయమై అధికారులు స్పందిస్తూ... దట్టమైన పొగమంచు కారణంగా విమానం బరువు తగ్గించేలా తక్కువ లగేజీ పెట్టారని, మిగతా లగేజీ కువైట్ విమానాశ్రయంలో ఉందని, మరో రెండు రోజుల్లో ప్రయాణికుల ఇళ్లకే వాటిని అందజేస్తామని అధికారులు తెలిపారు.

7 నుంచి ప్లస్ టూ ప్రాక్టికల్స్

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ విద్యార్థులకు ఫిబ్రవరి 7 నుంచి 14వ తేదిలోగా ప్రాక్టికల్స్ ముగించాలని పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్లస్ వన్, ప్లస్ టూ తరగతులకు మార్చిలో పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, ప్లస్ టూ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 7 నుంచి 14వ తేది, ప్లస్ వన్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి 21వ తేదిలోపు ముగించాలని పరీక్షల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

12న వరారణేశ్వరాలయంలో ఆరుద్ర ఉత్సవాలు

తిరుత్తణి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరువాలంగోడులోని వరారణేశ్వర ఆలయంలో ఈ నెల 12 ఆరుద్ర దర్శన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ పర్యవేక్షణలోని తిరువాలంగోడు వరారణేశ్వరాలయంలో ఆరుద్ర దర్శన వేడుకలు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటల నుంచి ఆలయ స్థల వృక్షం మర్రి చెట్టు కింద నటరాజస్వామికి అభిషేకపూజలు జరుగనున్నాయి. 13వ తేది ఉదయం స్వామిగోపురదర్శనంఇవ్వనున్నారు.

పొంగల్ ప్రత్యేక రైళ్లు



పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06569 బెంగళూరు-తూత్తుకుడి ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది బెంగళూరులో రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు తూత్తుకుడి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06570 తూత్తుకుడి-మైసూరు ప్రత్యేక రైలు ఈ నెల 11వ తేది తూత్తుకుడిలో మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు మైసూరు చేరుకుంటుంది.
- నెం.07319 బెంగళూరు-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది బెంగళూరులో ఉదయం 8.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07320 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- బెంగళూరు ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేది చెన్నై సెంట్రల్‌లో మధ్యాహ్నం 3.40 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.
- నెం.06058 తిరువనంతపురం సెంట్రల్- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 15వ తేది తిరువనంతపురం సెంట్రల్‌లో ఉదయం 4.25 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06059 చెన్నై సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేది చెన్నై సెంట్రల్‌లో అర్ధరాత్రి 1 గంటకు బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది.
- నెం.06046 ఎర్నాకుళం జంక్షన్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 16వ తేది ఎర్నాకుళంలో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06047 చెన్నై సెంట్రల్-ఎర్నాకుళం ప్రత్యేక రైలు ఈ నెల 17వ తేది చెన్నై సెంట్రల్‌లో ఉదయం 10.30 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు ఎర్నాకుళం జంక్షన్ చేరుకుంటుంది.

16 బోగీలతో వందే భారత్ రైలు...

చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి మధ్య నడుపుతున్న వందే భారత్ రైలు 16 బోగీలతో నడుపనున్నారు. ప్రస్తుతం ఈ రైలు 7 ఏసీ చైర్ కార్ బోగీలు, ఎగ్జిక్యూటివ్ కార్ మొత్తం 8 బోగీలతో నడుపుతున్నారు. ఈ రైలు ప్రయాణికుల ఆదరణ పెరగడంతో, వెయిటింగ్ భారీగా ఉంటోంది. ఈ విషయమై దక్షిణ రైల్వే సిఫారసులతో ఈ రైలు 16 బోగీలతో నడిపేందుకు రైల్వే శాఖ అంగీకారం తెలిపింది. ఈ నెల 11వ తేది నుంచి ఈ రైలు 16 బోగీలతో నడుస్తుందని అధికారులు తెలిపారు.

కొండ ప్రాంతాల్లో మంచు...

తీరప్రాంతాల్లో స్వల్పంగా వర్షాలు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూమధ్యరేఖ వెంబడి హిందూ మహాసముద్రం, దక్షిణ కేరళ తీర ప్రాంతం వరకు ఉపరితల ఆవర్తన ద్రోణి నెలకొంది. ఈ కారణంగా రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో స్వల్పంగా వర్షాలు, కొండ ప్రాంతాల్లో దట్టమైన మంచు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. అంతర్ జిల్లాల్లో పొడి వాతావరణం నెలకొని, ఉదయం తేలికపాటి పొగ మంచు కనిపించనుంది. నీలగిరి జిల్లాలోని కొండ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో మంచు అధికంగా కురిసే అవకాశముంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఎవరు ఆ సార్....?

- ద్విచక్రవాహనాలకు స్టిక్కర్లు

ఐసిఎఫ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'ఎవరు ఆ సార్...?' అంటూ అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగం ద్విచక్రవాహనాలకు స్టిక్కర్లు అంటించారు.



స్టిక్కర్లు అంటిస్తున్న మాజీ మంత్రి షణ్ముగం

అన్నా వర్శిటీ విద్యార్థిని అత్యాచారం కేసులో సంబంధం ఉన్న ఆ సార్ ఎవరు? అమటూ అన్నాడీఎంకే ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో, పార్టీ యువతుల విభాగంతో బుధవారం మాజీ మంత్రి సీవీ షణ్ముగం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఆయన పార్టీ కార్యకర్తల ద్విచక్రవాహనాలకు స్టిక్కర్లు అంటించారు. 'ఎవరు ఆ సార్' తేలేవరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా మాజీ మంత్రి షణ్ముగం స్పష్టం చేశారు.

అధికార పార్టీకి మాత్రం అనుమతులా...


- పోలీస్ కమిషనర్‌కు వ్యతిరేకంగా బీజేపీ పిటిషన్

వాషర్‌మెన్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ ఆందోళనకు అనుమతులిచ్చిన గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్‌కు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టులో బీజేపీ పిటిషన్ దాఖలుచేసింది. అన్నా విశ్వవిద్యాలయం విద్యార్థినిపై అత్యాచారం ఘటనలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ చేపట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసు శాఖ అనుమతులు నిరాకరించింది. అదే సమయంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా చెన్నై సహా అన్ని జిల్లా కేంద్రాల్లో అధికార డీఎంకే చేపట్టిన ఆందోళనలకు పోలీసు శాఖ అనుమతులు ఇచ్చింది. ఈ వ్యవహారంలో నగర పోలీస్ కమిషనర్‌పై చర్యలు చేపట్టాలంటూ మద్రాసు హైకోర్టులో బీజేపీ పిటిషన్ దాఖలుచేసింది. అలాగే, తమ పార్టీకి కూడా అనుమతులివ్వలేదంటూ పీఎంకే కూడా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది.

కళ్లకుర్చి విచారణ కమిటీ పొడిగింపు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి నకిలీ సారా ఘటనపై విచారిస్తున్న కమిటీకి మరో నెల రోజులు అవకాశం కల్పించారు. కళ్లకుర్చి కరుణాపురంలో నకిలీ సారాతాగి 69 మంది మృత్యువాతపడ్డారు. ఈ కేసు విచారణకు మాజీ న్యాయమూర్తి గోకుల్‌దాస్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ విచారణ పూర్తిచేసి మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కమిషన్ ఛైర్మెన్ గోకుల్‌దాస్ కరుణాపురానికి వెళ్లి మృతుల కుటుంబీకులు, చికిత్సలు పొందుతున్న వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో, కమిషన్ నివేదిక సమర్పణకు రెండవ సారిగా మరో నెల అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కృష్ణగిరి జిల్లాలో 10వ శతాబ్దం నాటి కన్నడ శాసనం



చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కృష్ణగిరి జిల్లా వేప్పనహల్లి సమీపంలోని నాచికుప్పంలో 10వ శతాబ్దానికి చెందిన నోలంబరాజు కాలం నాటి కన్నడ శిలా శాసనం లభ్యమైంది. ఇది నొలంబ రాజవంశానికి చెందిన బిరా నొలంబ (920-40) పాలన సూచిస్తున్నట్లు పురావస్తు శాఖాధికారులు తెలిపారు. ఆ సమయంలో జరిగిన యుద్ధంలో ఒక వీరుడి మరణం గురించి తెలియజేస్తోంది. అయితే ఆ వీరుడి పేరు స్పష్టంగా లేకుండాపోయింది. ఆ అమరుడి స్మారకార్థమే ఈ శిలాశాసనం వేసినట్లు తెలుస్తోంది.

సచివాలయ ముట్టడికి యత్నం

- 30 మంది బీజేపీ కార్యకర్తల అరెస్ట్

ప్యారీస్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అత్యాచారాన్ని ఖండిస్తూ సచివాలయాన్ని ముట్టడించేందుకు యత్నించిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ యువమోర్చాకు చెందిన సుమారు 30 మంది కార్యకర్తలు బుధవారం మెరీనా బీచ్ రోడ్డులో ఉన్న మద్రాస్ యూనివర్శిటీ ప్రవేశ ద్వారం వద్ద గుమిగూడారు. 'ఎవరా సార్?' అని ప్రశ్నిస్తూ ప్లకార్డులతో సచివాలయం ముందు ధర్నా చేసేందుకు ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు నిరసన ర్యాలీకి అనుమతి లేదని వారిని అరెస్టు చేశారు.

ఈపీఎస్ బంధువు సంస్థలు, ఇళ్లల్లో రెండోరోజు కొనసాగిన ఐటీ తనిఖీలు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు బట్వాడా, పన్నుల ఎగవేత తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈరోడ్ భవన నిర్మాణ సంస్థ కార్యాలయాలు, యజమాని నివాసాలు, ఆ సంస్థ శాఖల్లో మంగళవారం ప్రారంభమైన ఐటీ తనిఖీలు బుధవారం కూడా కొనసాగాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి బంధువైన ఎస్.రామలింగం అనే పారిశ్రామికవేత్త ఈరోడ్‌లో ప్రధాన కార్యాలయంగా 'ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్' ద్వారా భవన నిర్మాణలను చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై, కోయబత్తూరు, ఈరోడ్ ప్రాంతాల్లో ఉన్న ఆ సంస్థ శాఖలు సహా 26 చోట్ల ఐటీ సోదాలు జరిగాయి. బుధవారం ఈరోడ్ జిల్లాలో ఆ సంస్థ శాఖలలోనూ, రామలింగం అనుచరుల నివాసగృహాలు, సంస్థలలోనూ ఐటీ అధికారులు సాయుధదళం పోలీసులను వెంటబెట్టుకుని దాడులు జరిపారు.

కదిర్ ఆనంద్‌కు ఈడీ సమన్లు

- 22న హాజరుకావాలని ఆదేశం



అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి దురైమురుగన్ కుమారుడు, డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సమన్లు జారీ చేశారు. ఈ నెల 22వ తేదీ విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి గాంధీ నగర్‌లో ఉన్న మంత్రి దురైమురుగన్‌కు చెందిన నివాసాలు, ఆయన కుమారుడు కదిర్ ఆనంద్‌కు చెందిన కింగ్‌స్టన్ ఇంజనీరింగ్ కాలేజీ, డీఎంకే నేత పూంజోలై శ్రీనివాసన్ ఇల్లు సహా నాలుగు ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఈ నెల 3వ తేదీ తనిఖీలు చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం పది మందికిపైగా ఈడీ అధికారులు మరోమారు కదిర్ ఆనంద్‌కు చెందిన ఇంజనీరింగ్ కాలేజీలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆధారాలు, కీలక పత్రాలను పరిశీలించిన పిదప ఈ నెల 22వ తేదీన విచారణకు రావాలని ఎంపీ కదిర్ ఆనంద్‌కు సమన్లు జారీ చేశారు.

జల్లికట్టు ఎద్దులకు వైద్యపరీక్షలు



ఎద్దులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వెటర్నరీ వైద్యులు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అవనియాపురంలో ఈ నెల 14 జల్లికట్టు పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దులకు మంగళవారం నుంచి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అవనియాపురం వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ డా.పళనివేలు నేతృత్వంలో డా.బాబు ఎద్దులను పరీక్షించి సర్టిఫికెట్లు అందజేశారు. ఎద్దులు నాటు రకం, 4 పళ్లు కలిగి ఉండాలి, 132 సెం.మీ ఎత్తుతో 3 నుంచి 8 ఏళ్లలోపుండాలి, టీకాలు వేసి ఉండాలి, శరీరంలో ఎలాంటి గాయం ఉండకూడదు సహా పలు పరీక్షలు నిర్వహించి, వాటి యజమానులకు సర్టిఫికేట్లు అందజేశారు.

డీఎంకే ఎమ్మెల్యేలకు అసెంబ్లీ నియమాలు తెలియవు

- టీవీయూకే అధ్యక్షుడు వేల్ మురుగన్



మీడియాతో ఎమ్మెల్యే వేల్ మురుగన్

ప్యారీస్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎలా వ్యవహరించాలో డీఎంకే ఎమ్మెల్యేలకు తెలియదని తమిళగ వాల్వురిమై కట్చి (టీవీయూకే) అధ్యక్షుడు, ఎమ్మెల్యే వేల్ మురుగన్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మూడో రోజు సమావేశంలో గౌవర్నర్ ప్రసంగంపై దన్యవాదాలు తెలిపే తీర్మానంపై అధికార, విపక్షాల శాసన సభ్యులు మాట్లాడారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే వేల్ మురుగన్ సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యల గురించి అసెంబ్లీలో తెలియజేసేందుకు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలకు, అలాగే డీఎంకే కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలకు తగిన అవకాశం కల్పించడం లేదని, ఈ వ్యవహారంలో స్పీకర్ అప్పావు ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. సభలో డీఎంకే సభ్యులు తుంటరి తనంగా కేకలేస్తున్నారని, సభలో ఏం మాట్లాడాలో కూడా తెలియక జోకర్లల వ్యవహరిస్తున్నారని, ఇలాంటివి స్పీకర్ అడ్డుకోవాలని వేల్ మురుగన్ వాఖ్యలు చేశారు. తమిళగ వాల్వురిమై కట్చి డీఎంకే కూటమి పార్టీ కావడం గమనార్హం.

స్పృహతప్పి పడిపోయిన కార్యకర్త

- ప్రాథమిక చికిత్స చేసిన తమిళిసై



కార్యకర్తకు ప్రాథమిక చికిత్స చేస్తున్న తమిళిసై

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్త హఠాత్తుగా స్పృహతప్పి పడిపోవడంతో, అక్కడే ఉన్న బీజేపీ సీనియర్ నేత డా.తమిళిసై ప్రాథమిక చికిత్స లందించారు. టి.నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఈరోడ్ శాసనసభ ఉప ఎన్నికల్లో పోటీచేసే విషయమై బుధవారం పార్టీ సీనియర్ నేతలు సమావేశమయ్యారు. సమావేశం అనంతరం పై అంతస్తు నుంచి తమిళిసై కిందకు వచ్చే సమయంలో అక్కడే ఉన్న ఓ కార్యకర్త హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తమిళిసై అతడికి ప్రాథమిక చికిత్స చేసి, కోలుకున్న అనంతరం ప్రభుత్వాసుపత్రికి పంపించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంకే నేతలు

తిరుత్తణి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. పళ్లిపట్టు నార్త్ యూనియన్ డీఎంకే, జిల్లా సాహిత్య బృందం ఆధ్వర్యంలో అన్ని పంచాయతీల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. వెంకట్రాజకుప్పంలో మంగళవారం జరిగిన సమావేశానికి యూనియన్ సెక్రటరీ, న్యాయవాది సీజే శ్రీనివాసన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో యూనియన్ మాజీ కార్యదర్శి బి.రవీంద్రనాథ్, న్యాయవాది సీజే సెంథిల్‌కుమార్, పళ్లిపట్టు మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మెన్ ఎస్.మణిమేఘలై, యూనియన్ నిర్వాహకులు తిరుమలై లోకనాథన్, కె.ఆంజేయన్, శేఖర్, బి.వెంకటపెరుమాళ్, జి.మనోహరన్, పి.చిరంజీవి, యూనియన్ యూత్ ఆర్గనైజర్ ఎస్‌పి ఖలీల్, యు.సతీష్, జగదీష్, ఆర్.రామన్, పాండి, దివాకర్ సహా పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంకే ఆధ్వర్యంలో ధర్నా



తిరుత్తణి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో గవర్నర్ వాకౌట్ చేయడాన్ని నిరసిస్తూ డీఎంకే అధిష్టానం ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో మంగళవారం తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా డీఎంకే నేతలు నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు. తిరువళ్లూరు జిల్లా పెద్దకుప్పం వద్ద జరిగిన ఆందోళనకు జిల్లా అధ్యక్షుడు ద్రావిడ భక్తన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ సభ్యులు తిరుత్తణి భూపతి హాజరైయ్యారు. ఈ ఆందోళనలో డీఎంకే పార్టీ నేతలు, సరస్వతి చంద్రశేఖర్, శివశంకరి, నేతాజీ, రవిచంద్రన్, మోతీలాల్, కొండంజేరి రమేష్, జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ రాజకీయ ఏజెన్సీ కాదు...!

- మద్రాసు హైకోర్టు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుదియ తమిళగం ర్యాలీకి ఎందుకు అనుమతించలేదనే విషయమై అఫిడవిట్ దాఖలుచేయాలని కోరుతూ పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు నోటీసులు జారీచేసింది. గత ఏడాది నవంబరు 6వ తేది ర్యాలీ నిర్వహించేందుకు పుదియ తమిళగం పార్టీకి అనుమతులివ్వలేదు. అరుంధతీయ సామాజిక వర్గానికి అందిస్తున్న 3 శాతం రద్దు చేయాలని సహా 6 డిమాండ్లతో ర్యాలీ చేయాలని పుదియ తమిళగం నిర్ణయించగా పోలీసులు అనుమతులివ్వలేదు. ఈ ర్యాలీ కోసం తూత్తుకుడి సహా పలు జిల్లాల నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చిన నేపథ్యంలో, చివరి నిమిషంలో అనుమతి నిరాకరించారని, అందుకు రూ. కోటి పరువు నష్టం చెల్లించాలని పుదియ తమిళగం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ న్యాయమూర్తి వేల్‌మురుగన్ బుధవారం విచారించారు. ఈ సందర్భంగా, ర్యాలీకి అనుమతించడం, నిరాకరించడం వేరే విషయం అని, కానీ, ఈ విషయాన్ని చివరి నిమిషంలో ఎందుకు చెప్పారు? నిర్ణీత కాలానికి ముందే చెప్పవచ్చు కదా? అంటూ న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది. చివరి నిముషంలో అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీచేయడంపై అర్థమేంటి? పోలీసు శాఖ రాజకీయ ఏజెన్సీ కాదు, పిటిషన్‌పై పోలీసు శాఖ అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 24వ తేదీకి వాయిదావేస్తున్నట్లు న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఉత్తర్వులు జారీచేశారు.

- ముల్లైపెరియార్ డ్యాం కేసు..

కేంద్రానికి సుప్రీం నోటీసులు

ప్యారీస్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కేరళ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ముల్లైపెరియార్ డ్యాం నీటి సామర్థ్యం కేసులో సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ముల్లైపెరియార్ డ్యాం నీటి సామర్థ్యం 120 అడుగులకు తగ్గించాలని కోరుతూ కేరళకు చెందిన న్యాయవాది మాథ్యూ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇరుతరపు వాదల అనంతరం సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ముల్లైపెరియార్ డ్యాం భద్రత కోసం ఇప్పటి వరకూ నిపుణుల కమిటీని కేంద్రప్రభుత్వం నియమించలేదని ప్రశ్నించింది. అదే విధంగా ఇరు రాష్ట్రాల తరపున డ్యాం పరిశీలన చివరిగా ఎప్పుడు జరిగింది? నిపుణుల కమిటీని తమిళనాడు ప్రభుత్వం ఎప్పుడు నియమించింది వంటి పూర్తి వివరాలను తమ ముందుంచాలని కేంద్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బస్సు నుంచి క్షతగాత్రులను వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వాషర్‌మెన్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపంలో ఆమ్నీ బస్సు ప్రమాదానికి గురైన ఘటనలో ఒకరు మృతిచెందగా, 35 మందికి గాయాలయ్యాయి. వేలాంకన్ని నుంచి తిరువనంతపురం వెళ్తున్న ఆమ్నీ బస్సు పాళయంకోట టక్కమ్మాళ్‌పురం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద వస్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ఘటనలో లెవెంజిపురానికి చెందిన ప్రిస్కో అక్కడికక్కడే మృతిచెందగా, 35 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రులను వెలికితీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



లోకేశ్వరి (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిమ్మకాయలు కోసేందుకు యత్నించిన మహిళ విద్యుదాఘాతానికి మృతిచెందిన ఘటన విషాదం నింపింది. తిరువళ్లూర్ జిల్లా వరదాపురం గ్రామానికి చెందిన లోకేశ్వరి (26) మంగళవారం సాయంత్రం ఇనుప గజం సాయంతో తన ఇంటి ప్రాంగణంలో ఉన్న చెట్టు నుంచి నిమ్మకాయలు కోసేందుకు యత్నించింది. ఆ సమయంలో ఈచెట్టు మీదుగా వెళ్తున్న విద్యుత్ వైరుకి ఇనుప రాడ్ తగలడంతో షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందింది. కాగా, విద్యుత్ వైరు ప్రమాదకరంగా ఉందని, దీనిని తొలగించాలంటూ పలుమార్లు విద్యుత్ బోర్డు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే లోకేశ్వరి మృతికి కారణమంటూ బంధువులు రాస్తారోకో చేపట్టడం ఉద్రిక్తతకు దారితీసింది.

దోపిడీ దొంగను పట్టుకున్న సీఐకి అభినందన



ఇన్‌స్పెక్టర్ జయంతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ మదివానన్

వేలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను మూడు గంటల్లో అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ అభినందించారు. స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌కు చెందిన ఉమామహేశ్వరి మెడలో గొలుసును ఓ దొంగ లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో విరుధంబట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయంతి, మూడు గంటల్లో దొంగను అరెస్ట్ చేశారు. సీఐ ప్రతిభను అభినందిస్తూ ఎస్పీ మదివానన్ బుధవారం ఆమెను తన కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేశారు.

బాలికపై అత్యాచారం కేసు

అన్నాడీఎంకే నేత, మహిళా సీఐ అరెస్టు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నానగర్‌లో గత యేడాది పదేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసును సక్రమంగా విచారణ జరపని మహిళా సీఐ రాజీ, నిందితులకు మద్దతుగా వ్యవహరించిన అన్నాడీఎంకే స్థానిక నేత సుధాకర్‌ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ అత్యాచారం కేసులో వాటర్ క్యాన్లు సప్లయ్ చేసే సతీష్ అరెస్టయ్యాడు. ఈ కేసుపై సీబీఐ విచారణ జరపాలన్న హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకుంది. ఆ అప్పీలుపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు సీబీఐ విచారణకు బదులుగా రాష్ట్రంలో పనిచేస్తున్న రాష్ట్రేతరులైన ఏడుగురు ఐపీఎస్ అధికారులతో ఏర్పాటైన సిట్ ద్వారా విచారణ జరపాలని ఆదేశించింది. సిట్ రంగంలోకి దిగటంతో కేసు విచారణ వేగం పుంజుకుంది. బాధితురాలి కుటుంబీకులను బెదిరించడం, కేసు విచారణ సక్రమంగా విచారణ జరపకపోవటం వంటి ఆరోపణలపై అన్నాడీఎంకే స్థానిక నేత సుధాకర్, మహిళా పోలీసుస్టేషన్ సీఐని బుధవారం అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా ఈ కేసులో అరెస్టయిన సుధాకరన్‌ని పార్టీ నుండి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు.

నేటినుంచి కోయంబేడు మార్కెట్లో ప్రత్యేక సంత

300 మంది పోలీసులతో బందోబస్తు

ఐసిఎఫ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్లో గురువారం నుంచి పొంగల్ ప్రత్యేక సంత జరుగనుంది. పొంగల్ పండుగ సందర్భంగా దుకాణాల యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది వరకు ప్రత్యేక సంత జరుగనుంది. ఈ సంతలో స్థానిక వ్యాపారులతో పాటు బయట వ్యాపారులు కూడా తమ సరుకులు విక్రయించొచ్చు. ఈ ప్రత్యేక సంతకు విల్లుపురం, కడలూరు, సేలం, పుదుచ్చేరి సహా పలు ప్రాంతాల నుంచి చెరకు గడలు, పసుపు కొమ్ములు, అల్లం తదితరాలు విక్రయానికి రానున్నాయి. 3 ఎకరాల విస్తీర్ణంలో జరుగనున్న ఈ సంతలో కొనుగోలుదారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. అలాగే, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ రద్దీ కలుగకుండా 300 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టనున్నారు.



'మద్రాస్ కారన్' ఆడియో రిలీజ్ దృశ్యం

'మద్రాస్ కారన్' కంబ్యాక్ మూవీ

● నిహారిక

తమిళ చిత్రజ్యోతి

'మద్రాస్ కారన్' మూవీ తనకు తమిళంలో కంబ్యాక్ మూవీ వంటిదని, అందువల్ల మీడియాతో పాటు ప్రేక్షకులు సైతం ఆదరించాలని టాలీవుడ్ నటి నిహారిక విజ్ఞప్తి చేశారు. మలయాళ నటుడు షేన్ నిగమ్ - నిహారిక, ఐశ్వర్య దత్తా జంటగా నటించిన 'మద్రాస్ కారన్' ఈ నెల 10వ తేదీ విడుదలవుతుంది. దీన్ని పురస్కరించుకుని ఆడియో, ట్రైలర్ విడుదల నగరంలో నిర్వహించారు. ఇందులో హీరోహీరోయిన్లతో పాటు చిత్ర బృందం పాల్గొన్నారు. ఇందులో నిహారిక మాట్లాడుతూ, 'కొవిడ్ ముందు తెలుగులో నేను నటించిన చిత్రం విడుదలైంది. చాలాకాలం తర్వాత నేను హీరోయిన్‌గా నటించిన చిత్రం విడుదలవుతుంది. ఒక విధంగా చెప్పాలంటే తమిళంలో కంబ్యాక్ మూవీ. 'మద్రాస్ కారన్'తోపాటు మా అన్న రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' మూవీ సూపర్‌హిట్ కావాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. హీరో షేన్ నిగమ్ మాట్లాడుతూ, 'నేను నటించిన చిత్రం తొలిసారి తమిళంలో విడుదల చేస్తున్నాం. మీడియా అండగా ఉండాలని కోరారు. ఇదిలావుండగా ఈ మూవీలో కరుణాస్, కలైయరసన్ కీలక పాత్రలు పోషించారు. ఎస్ఆర్ ప్రొడక్షన్ పతాకంపై బి.జగదీష్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదల చేయగా, మంచి స్పందన వచ్చింది. అయితే, ట్రైలర్‌లో యాక్షన్, హింస సన్నివేశాలు అధికంగా ఉన్నాయి.

మనోవేదనకు గురయ్యాను



● మీనాక్షి చౌదరి

విజయ్ హీరోగా నటించిన 'ది గోట్' సినిమాలో రెండో హీరోయిన్‌గా నటించిన మీనాక్షి చౌదరి తన మనసులోని బాధను తాజాగా వెల్లడించారు. ఈ మూవీలో తాను నటించిన పాత్రకు సోషల్ మీడియా వేదికగా నెగెటివ్ కామెంట్స్ వచ్చాయని, వాటిని చూసిన తాను తీవ్ర మనోవేదనకు గురైనట్టు పేర్కొన్నారు. దక్షిణ భారత చిత్రపరిశ్రమ హీరోయిన్ మీనాక్షి చౌదరి తమిళంలో 'కొలై', 'సింగపూర్ సలూన్', 'ది గోట్' వంటి చిత్రాల్లో నటించారు. గత యేడాది దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'లక్కీ భాస్కర్'లో ఓ బిడ్డకు తల్లిగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పైగా ఈ చిత్రం సూపర్‌హిట్ కావడంతో ఆమెకు కూడా మంచి పేరు వచ్చింది. ఈ క్రమంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మీనాక్షి చౌదరి... 'ది గోట్' మూవీలోని తన పాత్రపై స్పందించారు. 'గత యేడాది విజయ్‌తో కలిసి 'ది గోట్' మూవీలో శ్రీనిధి అనే పాత్రలో నటించాను. ఈ పాత్రలో నటించినందుకు నన్ను అనేక మంది హేళన చేశారు. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్రస్థాయిలో ట్రోల్స్ చేశారు. వీటిని చూసి తీవ్ర మనోవేదనకు గురయ్యాను. ఆ తర్వాత నేను సోలో హీరోయిన్‌గా నటించిన 'లక్కీ భాస్కర్' విడుదలైంది. అందులో నా పాత్రకు మంచి మార్కులతో పాటు పేరు, ప్రశంసలు వచ్చాయి. దీంతో మనసు కుదుటపడింది' అని పేర్కొన్నారు.

రాజకీయాలపై ప్రశ్నలు అడగొద్దు



● రజనీకాంత్

అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోమారు మీడియాపై అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాల గురించి ప్రశ్నలు అడగొద్దని ఎన్నిసార్లు చెప్పాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న 'కూలీ' సినిమా తదుపరి షెడ్యూల్ షూటింగ్ కోసం ఆయన మంగళవారం థాయ్‌లాండ్ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'కూలీ' సినిమా షూటింగ్ 70 శాతం మేరకు పూర్తయిందని, తదుపరి షెడ్యూల్ కోసం థాయ్‌లాండ్‌కు వెళుతున్నానని చెప్పారు. ఇంతలో ఓ విలేఖరి కల్పించుకుని 'రాష్ట్రంలో మహిళల భద్రతపై మీ స్పందన ఏంటి' అని ప్రశ్నించడంతో రజనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలపై ప్రశ్నలు వేయవద్దని ఎన్నిసార్లు చెప్పాలంటూ, చూపుడువేలు చూపిస్తూ అక్కడ నుంచి వెళ్లిపోయారు.



22న ధనుష్ - నయనతార కేసు
తుది విచారణ

హీరోయిన్ నయనతారపై హీరో ధనుష్ దాఖలు చేసిన నష్టపరిహారం కేసు తుది విచారణ ఈ నెల 22వ తేదీ జరుగనుంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు బుధవారం ఆదేశించింది. నయనతార బయోగ్రఫీ ఆధారంగా తెరకెక్కిన 'నయనతార: బియాండ్ ది ఫేరీ టేల్' అనే డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా తెరకెక్కిన 'నానుమ్ రౌడీదాన్' మూవీలోని కొన్ని సన్నివేశాలను పెట్టారు.తన అనుమతి లేకుండా ఈ సన్నివేశాలను ఉపయోగించారని,ఇందుకోసం తమకు రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ధనుష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు నయనతార దంపతులతో, డాక్యుమెంటరీ స్ట్రీమింగ్ అవుతున్న నెట్‌ఫ్లిక్స్ సంస్థకు నోటీసులు జారీ చేయడంతో పాటు ధనుష్ కూడా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి, జనవరి 8వ తేదీకి వాయిదా వేసింది. ఆ ప్రకారంగా ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇందులో అన్ని అంశాలను పరిశీలించిన హైకోర్టు తుది విచారణను ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది.



మదురై కళ్ళలగర్ ఆలయంలో ఎస్కే దంపతులు

ఆలయాలకు శివకార్తికేయన్ ఫ్యామిలీ

'అమరన్' మూవీ వంటి ఘన విజయం తర్వాత హీరో శివకార్తికేయన్ (ఎస్కే) ఇపుడు తన కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా వరుసగా ఆలయాలను సందర్శిస్తూ దైవ దర్శనాలు చేసుకుంటున్నారు. మంగళవారం తిరుచ్చెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో వెళ్ళిన ఎస్కే... ఆలయంలో మురుగ పెరుమాళ్, షణ్ముగర్, పెరుమాళ్, దక్షిణామూర్తి సన్నిధుల్లో పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత తిరుప్పరుకుండ్రం, పళని ఆలయానికి వెళ్ళారు. బుధవారం మదురై కళ్ళలగర్‌ను దర్శనం చేసుకున్నారు. అంతకుముందు ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన లైంగికదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇలాంటి సంఘటన జరగకూడదు. ఈ కేసులో పోలీసులు బాగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు మనమంతా బాధిత మహిళలకు అండగా ఉండాలి. మహిళలు కూడా ధైర్యంగా ఉండాలి. ఇలాంటి సంఘటనలు ఇకపై జరగకూడదని దేవుడిని ప్రార్థించాను' అని వెల్లడించారు.



శివకార్తికేయన్ - ఆర్తీ దంపతులు

పాలమేడు జల్లికట్టుకు విస్తృత ఏర్పాట్లు



జల్లికట్టు కోసం సిద్ధం చేస్తున్న మైదానం

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పాలమేడు జల్లికట్టు కోసం భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ నెల 15న పాలమేడు మంజమలై ఆరు దిడల్ వాడివాసల్‌లో ఎద్దులు రంకెలు వేయనున్నాయి. వాటిని అణచివేసేందుకు ఇప్పటికే యువకులు అన్ని పరీక్షలు చేసుకుని సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఈ జల్లికట్టుని నిర్వహించేందుకు పొదు మహాలింగ స్వామి మఠం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుతం వాడివాసల్‌కు పెయింటింగ్, గ్యాలరీల నిర్మాణం, రెండంచెల భద్రతను కల్పించేలా ప్రత్యేకంగా బారికేడ్లు తదితరాలు ఏర్పాటు చేస్తున్నారు. పాలమేడు నగర పంచాయతీ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ జల్లికట్టు వేడుకల మైదానానికి సంబంధించి ప్లాన్ ప్రస్తుతం విడుదలైంది. ఆ ప్రణాళిక నివేదిక ప్రకారం ఈ యేడాది పటిష్టమైన భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆరుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, జల్లికట్టు చూడటానికి తాత్కాలిక గ్యాలరీలు కూడా నిర్మిస్తున్నారు. అంతే కాకుండా నాలుగు ప్రాంతాలలో పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు ప్రత్యక్ష ప్రసారం కూడా చేయనున్నారు. పాలమేడు జల్లికట్టులో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా 4820 ఎద్దుల యజమానులు, 1914 మంది యువకులు పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ వాడివాసల్ వద్ద సుమారు 900 మంది ఎద్దులను విడిచిపెట్టాలని పొదు మహాలింగస్వామి మఠం కమిటీ నిర్వాహకులు నిర్ణయించారు. ఆ మేరకు అర్హత కలిగిన ఎద్దులను అధికసంఖ్యలో ఈ క్రీడలలో పాల్గొనేలా తగు చర్యలు చేపడుతున్నారు.

కావేరి హాస్పిటల్‌లో హృద్రోగులకు ప్రత్యేక శస్త్రచికిత్సలు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని కావేరి హాస్పిటల్‌లో గత డిసెంబర్‌లో గుండెపోటుకు గురై తీవ్ర అస్వస్థతతో బాధపడిన 15 మందికి ప్రత్యేక స్టెమ్ తరహా శస్త్రచికిత్స నిర్వహించినట్లు కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. బుధవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గుండెపోటు సమయంలో రక్తనాళంలో గడ్డకడుతున్న రక్తాన్ని వైర్ బెలూన్‌ను పంపి తొలగించటమే ఈ ప్రత్యేక శస్త్రచికిత్స ముఖ్యాంశమని ఆయన వివరించారు. వడపళని ఆస్పత్రిలో ఈ రకం శస్త్రచికిత్సలకు కేథ్ ల్యాబ్, వైద్యనిపుణులు నిరంతరం అందుబాటులో ఉండడంతో డిసెంబర్‌లో రెండు రోజులకు ఒకరు చొప్పున గుండెపోటు బాధితులకు శస్త్రచికిత్సలందించినట్లు తెలిపారు. ఈ రికార్డును నెలకొల్పిన వైద్యనిపుణులు డాక్టర్ సుందర్, ప్రొఫెసర్ పి.మనోహర్, డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ మహదేవన్‌ను ఆయన అభినందించారు. మీడియా సమావేశంలో ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో పాల్గొన్న డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, వైద్యనిపుణులు



వైకుంఠ ఏకాదశి ప్రసాదం

● 1,08,000 లడ్లు సిద్ధం



లడ్లు తయారు చేస్తున్న మహిళలు

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ వీరరాఘవ పెరుమాళ్ ఆలయంలో ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ రోజున స్వామి దర్శనం చేసుకొనే భక్తులు, వైకుంఠ ద్వార ప్రవేశం చేస్తుంటారు. ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి వేడుకలు గత నెల 30వ తేది పగల్‌పత్తుతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 10న వైకుంఠ ద్వార ప్రవేశం, ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు గరుడ వాహనంపై వైకుంఠ ద్వారం మీదుగా వచ్చి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ వేడుకల్లో లక్ష మందికి పైగా భక్తులు పాల్గొనే అవకాశముందని ఆలయ నిర్వాహకులు భావిస్తున్నారు. భక్తులకు లడ్డూ ప్రసాదంగా ఇచ్చేందుకు శ్రీవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కామాక్షి అమ్మవారి కల్యాణ మండపంలో ప్రసాదం తయారీ ప్రారంభించారు. ఈ విషయమై ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి రోజున భక్తులకు ప్రసాదంగా అందించేలా 1,08,00 లడ్డూలు తయారుచేస్తున్నామన్నారు. సుమారు 200 మంది భక్తులు లడ్డూ తయారీలో పాల్గొన్నారని వారు తెలిపారు.

జెమ్ ఆస్పత్రిలో మయన్మార్ మహిళకు కొత్త జీవితం



అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంలోని జెమ్ ఆస్పత్రి వైద్యులు మయన్మార్‌కు చెందిన మహిళకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. 66 యేళ్ళ మహిళకు ఈ ఆస్పత్రిలో నిర్వహించిన కాలేయ మార్పిడి ఆపరేషన్ విజయవంతమైంది. ఈ మహిళ హైపటైటిస్ సి వైరస్‌తో పాటు కామెర్లతో బాధపడుతూ వచ్చారు. ఆమెకు జెమ్ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో కాలేయ మార్పిడి చికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేయగా, ఆ మహిళ పూర్తి కోలుకోడంతో తిరిగి స్వదేశానికి వెళ్ళనున్నారు. ఈ ఆపరేషన్‌ను డాక్టర్ మాగ్నస్ జయరాజ్ సారథ్యంలో డాక్టర్ కార్తిక్ రాజ్ తదితరులతో కూడిన వైద్య బృందం నిర్వహించించినట్టు ఆస్పత్రి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా 'స్కైమాంక్' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో విద్యాగణపతి, ఆర్ఆర్.శరత్‌సింగ్, జె.రంగనాథన్

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రచయిత ఆర్ఆర్ శరత్‌సింగ్ విరచిత 'స్కైమాంక్' పుస్తకావిష్కరణ నగరంలో జరిగింది. ఆధునిక ప్రపంచంలో, యువత, ప్రతిష్ఠాత్మకమైన వ్యక్తులను శ్రేష్ఠతవైపు నడిపించే లక్ష్యంతో రూపొందించిన ఈ పుస్తకాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన విజయనగరం యువరాణి విద్యా గజపతిరాజు సింగ్, మయన్మార్ కాన్సుల్ ప్రొఫెసర్ జె.రంగనాథన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యాగజపతి మాట్లాడుతూ.. కలలు కనేవారికి ఆశ, ప్రేరణ రాబోయే తరాలకు ప్రతిధ్వనించేలా ఆర్ఆర్ శరత్‌సింగ్ అద్భుతంగా ఈ పుస్తకాన్ని రూపొందించారన్నారు.

ఉచ్చి పిళ్ళైయార్ ఆలయానికి లిఫ్ట్ సౌకర్యం

● మంత్రి శేఖర్ బాబు వెల్లడి

అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలోని ప్రసిద్ధ ఉచ్చి పిళ్ళైయార్ ఆలయానికి లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నట్టు దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా, బుధవారం తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఇనికో ఇరుదయరాజ్ అడిగిన ప్రశ్నకు మంత్రి శేఖర్‌బాబు సమాధానమిచ్చారు. ఉచ్చి పిళ్ళైయార్ ఆలయానికి రోప్ కార్ సౌకర్యం కల్పించడం సాధ్యం కాదన్నారు. కానీ, లిఫ్ట్ మాత్రం కల్పిస్తామన్నారు. ఈ యేడాది చివరికి ఆలయంపైకి భక్తులు సులభంగా వెళ్ళేలా మార్గాన్ని నిర్మిస్తామన్నారు. అలాగే, తిరుపోరూర్ కందస్వామి ఆలయ హుండీలో జారిపడిన యాపిల్ మొబైల్ ఫోన్ తిరిగి యజమానికి అందజేసినట్టు మంత్రి వెల్లడించారు.

సమాజ శ్రేయస్సు కోసం కృషి చేద్దాం

● ఎన్‌సీసీఎఫ్ సమావేశంలో బిషప్‌ల పిలుపు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న శాంతకుమార్ పాత్ర, రీజా పాత్ర, బిషప్ పద్మారావు తదితరులు

ప్యారీస్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ బోధకులు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫెలోషిప్ (ఎన్‌సీసీఎఫ్) సమావేశంలో పాల్గొన్న బిషప్‌లు పిలుపునిచ్చారు. కొరుక్కుపేట, చిగురింతపాళెంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో బుధవారం క్రిస్మస్ ముగింపు వేడుకలు, ఎన్‌సీసీఎఫ్ బిషప్ డా.దేవదాస్ పాత్ర 75వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవ.హరిదాస్ లాజర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా తెలంగాణ బిషప్ ఎం.పద్మారావు, ఆర్చ్ బిషప్ డా.పి.సాలమన్‌జాబ్స్, బిషప్ తిమోతి, రెవ.డా. దయాపాత్ర తదితరులు పాల్గొన్నారు. రెవ.ఆర్ శాంతకుమార్ పాత్ర, రీనా పాత్రలు కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. సూరిపోగు జోసఫ్ రాజ్‌కుమార్, రావినూతల పిచ్చేశ్వరరావు సహా వందమందికి పైగా తెలుగు పాస్టర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భాగంగా 175 మంది మహిళలకు చీరలు, పురుషులకు దోవతులు, టీషర్టులు ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, సమాజ శ్రేయస్సు కోసం క్రైస్తవులు తమ వంతు కృషి చేసి మార్గదర్శకులుగా జీవించాలని పిలుపునిచ్చారు.

కోలాహలంగా వీఐటీ పొంగల్ వేడుకలు

వేలూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్సిటీలో పొంగల్ వేడుకలు కోలాహలంగా సాగాయి. వర్సిటీ విద్యార్థుల సంక్షేమ విభాగం, పావేందర్ భారతిదాసన్ తమిళ ఇలక్కియ మండ్రం, వ్యవసాయ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా వర్సిటీ ప్రాంగణంలో గ్రామీణ వాతావరణం తలపించేలా గుడిసెలు ఏర్పాటుచేశారు. మట్టికుండల్లో పచ్చి బియ్యం వేసి పొంగల్ వేడుకలను వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ... తమిళుల సంప్రదాయం పండుగ పొంగల్, రైతుల పండుగగా పిలుస్తుంటారన్నారు. ఈ పండుగ వ్యవసాయ రంగం, రైతులకు పాత్ర తెలియజేసేలా ఉంటుందన్నారు. ఈ పండుగను స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులంతా కలసి ఆనందంగా జరుపుకొనేలా ఉంటుందని ఛాన్సలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విభాగం తరఫున ఐదు పుస్తకాలను ఛాన్సలర్ విశ్వనాథన్ ఆవిష్కరించగా, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ స్టీఫెన్ జయకుమార్, సెంథమిల్ సెల్వన్ సహా ఐదుగురు అందుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాథన్, జాయింట్ ఉపాధ్యక్షులు కాదంబరి, వైస్ ఛాన్సలర్ కాంచన భాస్కరన్, వైస్, ప్రొ ఛాన్సలర్ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ జయభారతి సహా లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో తంజావూరు వాద్యం, పెద్ద భజంత్రీలు పలు గ్రామీణ కళారూపాలు ప్రదర్శించారు.



పొంగళ్లు పెడుతున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ - పుస్తకావిష్కరణలో విశ్వనాథన్





కన్నియాకుమారి నగర పంచాయతీని మున్సిపాలిటీగా స్థాయి పెంచినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలుపుకుంటున్న నాగర్‌కోవిల్ కార్పొరేషన్ మేయర్ ఆర్.మహేష్, కన్నియాకుమారి నగర పంచాయతీ అధ్యక్షుడు స్టీపన్, కౌన్సిలర్లు

పిల్లలను పుస్తక ప్రదర్శనకు తీసుకురండి

● తల్లిదండ్రులకు అన్నామలై పిలుపు



ప్రదర్శనలో పుస్తకాలు వీక్షిస్తున్న అన్నామలై

ఐసిఎఫ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పుస్తక ప్రదర్శనకు తీసుకురావాలని తల్లిదండ్రులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పిలుపునిచ్చారు. స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనను ఇటీవల అన్నామలై వీక్షించారు. ఈ విషయమై అన్నామలై తన 'ఎక్స్' పేజీలో... "పుస్తక ప్రదర్శన చూసే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి కలిగించడం మన బాధ్యత. ఈ నెల 12వ తేది వరకు జరుగనున్న పుస్తక ప్రదర్శనకు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకురావాలని కోరుతున్నాను. పలు రంగాలకు చెందిన అనేక పుస్తకాలు ఒకేచోట కనిపిస్తుండడం, పిల్లలకు మరింత ఆనందం, పుస్తకాలు చదవాలనే ఆసక్తి కలుగుతుంది. అందువల్ల, అందరూ పుస్తక ప్రదర్శన వీక్షించాలని కోరుకుంటున్నాను' అంటూ అన్నామలై పోస్ట్ చేశారు.

ప్రశాంత్ హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ ఆపరేటివ్ కేర్

అడయార్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన ప్రశాంత్ హాస్పిటల్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సర్జికల్ థియేటర్‌తో కూడిన అడ్వాన్స్‌డ్ ఆపరేటివ్ కేర్ ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో వివిధ రకాల సంక్లిష్ట ప్రక్రియల కోసం ఖచ్చితంగా ఫలితాన్నిచ్చే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోబోటిక్ సర్జరీ సెంటర్ ప్రారంభించారు. ముఖ్యంగా యూరాలజీ, గైనకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ సర్జరీ, కార్డియోథొరాసిక్ సర్జరీ వంటి వివిధ శాఖలను అనుసంధానం చేశారు.. అలాగే, ఈ ఆస్పత్రిలో దేశంలోనే తొలిసారి సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ ఎస్ఎస్ఐ మంత్రా 3 రోబోట్‌ను ఈ ఆస్పత్రిలో ఏర్పాటు చేయడం గొప్ప మైలురాయి వంటిదని ప్రశాంత్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం

- భక్తులు ఆందోళన పడవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి పిలుపు
- కొత్త వైరస్ ప్రచారం నేపథ్యంలో మాస్కులతో రావాలని సూచన



'తిరుమల ఆలయంలో పదిరోజుల పాటు వైకుంఠద్వారాలు తెరిచే ఉంటాయి. కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రశాతంగా టోకెన్లు పొందండి. వైకుంఠద్వార దర్శనాలు చేసుకోండి' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బుధవారం ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాకు వివరించారు. 3 వేల మంది పోలీసులు, 1,500 వందల మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రత కల్పిస్తామన్నారు. ఇక, వైకుంఠద్వార దర్శన రోజుల్లో టోకెన్లు లేని భక్తులకు దర్శనాలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు. కాగా కొత్త వైరస్ వస్తోందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో భక్తులు మాస్కులు ధరించి అన్ని జాగ్రత్తలతో తిరుమలకు రావాలని టీటీడీ చైర్మన్ కోరారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీధర్‌బాబు





బెల్లంకొండ సురేష్ - గౌతమ్ సింఘానియా

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, సినీనిర్మాత బెల్లంకొండ సురేష్, రేమాండ్ సంస్థ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ ఎంపీ చింతా మోహన్ ఉన్నారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,566

తలనీలాలు సమర్పించినవారు: 16,021



ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న రంగనాథుడు



సేవలో పాల్గొనే మహిళలకు సంప్రదాయ వస్త్రాలు అందజేస్తున్న హరికుమార్

ప్యారీస్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్ టౌన్ ముల్లా వీధిలోని రంగనాథస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబయింది. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల వరకు స్వామివారికి తిరుమంజనోత్సవం, అనంతరం 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీవారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతి ఏడాది మాదిరిగానే శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజలు, 350 మంది ముత్తైదువులు సామూహిక కుంకుమార్చన చేయనున్నారు. ఈ పూజల్లో హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు పాల్గొంటారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ జె.హరికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ముక్కోటి ఏకాదశి సేవలో పాల్గొనేమహిళలకు సంప్రదాయ వస్త్రాలు, పూజాసామగ్రి పంపిణీ జరిగిందని, భక్తుల సహకారంతో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

'గుర్రపు థాలీ దుంప' మాదకద్రవ్యమా...?

- పరిశోధనకు పంపాలని పోలీసుల నిర్ణయం



గుర్రపు థాలి దుంప

పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్ కవుంజి పరిసర ప్రాంతాల్లో పండించే 'గుర్రపు థాలీ దుంప'లో మాదకద్రవ్యాలున్నాయా? లేదా అని పరిశోధనకు పంపాలని పోలీసులు నిర్ణయించారు. కొడైకెనాల్ కవుంజి, పూండి తదితర ప్రాంతాల్లో ఈ దుంప సాగవుతోంది. ఈ దుంపను రాయిపై రుద్ది ముద్దగా చేస్తే, ఈ ముద్ద నుంచి వచ్చే వాసన కారణంగా మెదడు చురుగ్గా పనిచేస్తుందంటారు. పూండికి చెందిన రాజా అనే వ్యక్తి కొడైకెనాల్ వచ్చే పర్యాటకులకు ఈ దుంపలు విక్రయించేవాడు. ఇటీవల ఆ ప్రాంతానికి వచ్చిన కేరళ యువకులు ఈ దుంప కొనుగోలు వీడియోగా తీసి, ఈ దుంప వాసన చూస్తే మత్తులో జోగుతామంటూ వ్యాఖ్యలు జతచేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ చూసిన కొడైకెనాల్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం రాజాను పిలిపించి విచారించారు. అలాగే, ఈ దుంపలో మాదక ద్రవ్యం ఉందా అనే విషయ నిర్ధారణకు, పూండి ప్రాంతంలో పండించిన దుంప నమూనా సేకరించి చెన్నైలోని ల్యాబ్‌కు పంపారు. ఫలితాల ఆధారంగా తదుపరి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

చిల్లకూరు, తడ పోలీసులచే వంద కిలోల గంజాయి పట్టివేత

- మాజీ హోంగార్డుతో పాటు ఆరుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- మూడు కార్లు స్వాధీనం



సీజ్ చేసిన 100 కిలోల గంజాయిని మీడియాకు చూపుతున్న తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు చోట్ల 100 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వీటి విలువ రూ.25 లక్షలు ఉంటుందని అంచనా. చిల్లకూరు పోలీసులు 72 కిలోలు, నలుగురు నిందితులను.. తడ పోలీసులు 28 కిలోల గంజాయి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. ఈ వివరాలను బుధవారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం..

- పుత్తూరుకు చెందిన మాజీ హోంగార్డు పసుపులేటి గిరిబాబు, తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన మదన్‌కుమార్, గుమ్మిడిపూడికి చెందిన పంజనాథన్, మునసుందరం కొంతకాలంగా కాకినాడ జిల్లా తుని నుంచి గంజాయి తీసుకొచ్చి పుత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో విక్రయించేవారు. గతంలో గిరిబాబుపై కేసు నమోదైంది. తాజాగా వీరు తుని నుంచి కారులో దాదాపు 72 కిలోల గంజాయి తీసుకొస్తున్నారనే ముందస్తు సమాచారం అందింది. దీంతో గూడూరు డీఎస్పీ రమణకుమార్, అతడి బృందం మంగళవారం రాత్రి చిల్లకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కడివేడు గ్రామం, కోట క్రాస్ రోడ్డు వద్ద వేచి ఉన్నారు. అతి వేగంగా ముందు పైలట్ చేస్తున్న మాజీ హోంగార్డు గిరిబాబు కారు వస్తుండగా వెనుక గంజాయి తీసుకొస్తున్న మరో కారు పోలీసులను చూసి తప్పించుకుని పోవడానికి ప్రయత్నించారు. కారులో వెళ్లిపోతుండగా పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో పోలీసు కారును సైతం ఢీకొట్టే ప్రయత్నం చేశారు. చివరకు రెండు కార్లు, దాదాపు 72 కిలోల గంజాయి స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మళ్లీ వారిని కస్టడీకి తీసుకుని విచారించనున్నట్లు ఎస్పీ చెప్పారు.

తడ పరిధిలో...

తమిళనాడు రాష్ట్రం గుమ్మడిపూడికి చెందిన కె.షారూఖాన్, అదే ప్రాంతం సామిరెడ్డి కండ్రిగకు చెందిన జి. అరుళ్ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారు. ఈ క్రమంలో ముందుగా అందిన సమాచారం మేరకు తడ సర్కిల్ పరిధిలోని శ్రీసిటీ వద్ద పోలీసులు కాపుకాచారు. వీరు కారులో చెన్నైకు గంజాయి తరలించడానికి వస్తుండగా చేజ్ చేసి పట్టుకున్నారు. వీరి నుంచి 28 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, షారూఖాన్, అరుళ్‌ను అరెస్టు చేశారు.

శెహభాష్ డీఎస్పీ, సీఐలు

ఆరుగురు గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలోప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్, సీఐ కిషోర్‌బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బందిని.. తడ ఘటనలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్పనాయుడు, సిబ్బంది ఉన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

యూజీసీ నిబంధనలపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్ల ఎంపికకు సెర్చ్‌కమిటీని నియమించే బాధ్యతను ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న గవర్నర్‌కు అప్పగించేలా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రకటించిన నిబంధనపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా వీసీల పదవీ కాలాన్ని మూడేళ్ల నుండి ఐదేళ్లకు పెంచుతూ యూజీసీ చేసిన సవరణపై కూడా ఆయన మండిపడ్డారు. యూజీసీ తీసుకున్న ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు చేపడతామని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాట మద్రాసు విశ్వవిద్యాలయం, మదురై విశ్వవిద్యాలయం, కోయంబత్తూరు భారతిదాసన్ విశ్వవిద్యాలయం, తమిళనాడు అధ్యాపక విద్యా విశ్వవిద్యాలయంలో వీసీ పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఈ విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించేందుకు తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. గవర్నర్ ఆయా సెర్చ్ కమిటీల్లో యూజీసీ ప్రతినిధి కూడా ఉండాలని, అందుకు అనువుగా సెర్చ్‌కమిటీ సభ్యుల సంఖ్య నాలుగుకు పెంచాలంటూ ప్రభుత్వ ప్రతిపాదన తిప్పి పంపారు. ఈ నేపథ్యంలో యూజీసీ మంగళవారం వీసీల నియామకానికి సెర్చ్‌కమిటీ ఏర్పాటు బాధ్యతలను పూర్తిగా గవర్నర్‌కే కల్పిస్తూ కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. ఈ నిర్ణయం రాజ్యాంగ ధర్మాసనానికి వ్యతిరేకమైనదని స్టాలిన్ మండిపడ్డారు. యూజీసీ అమలులోకి తెచ్చిన ఈ కొత్త నిబంధన వల్ల గవర్నర్ తన ఇష్టానుసారం విద్యావేత్తలు కానివారిని కూడా వీసీలుగా నియమించుకునే సంపూర్ణ అధికారాలను కట్టబెట్టినట్లయిందన్నారు. ఇది ఫెడరల్ రాజ్యాంగ విధానంపైన, రాష్ట్రాలకున్న హక్కులపైనా జరిగిన ప్రత్యక్షదాడిగా ఆయన అభివర్ణించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల చేతుల్లోనే విద్యారంగం ఉండాలే తప్ప కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అడుగులకు మడుగులొత్తే గవర్నర్ల చేతుల్లో ఉండకూడదన్నారు. ఈ విషయంపై త్వరలో న్యాయపోరాటం చేస్తామని స్టాలిన్ హెచ్చరించారు.

తమిళనాడు సరిహద్దులో ప్రైవేటు బస్సు బోల్తా

పది మందికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన ప్రైవేటు బస్సు

వి.కోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఓంశక్తి భక్తులతో వెళుతున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. బుధవారం ఉదయం కర్ణాటక రాష్ట్రం కోలారు నుంచి సుమారు 50 మంది ఓంశక్తి భక్తులతో ప్రైవేటు బస్సు మేల్‌మరవత్తూరుకు బయల్దేరింది. ఆంధ్రా - తమిళనాడు సరిహద్దులో బత్తరపల్లె సమీపంలో ఉదయం 11 గంటల సమయంలో నాయకనేరి దాటి తమిళనాడు పరిధిలోకి ప్రవేశించింది. పేర్నాంబట్ ఘాట్‌లోని ప్రమాదకర మలుపుల్లో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. రోడ్డుపై అడ్డుగా బస్సు ఉండటంతో వాహనాల రాకపోకలకు సుమారు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పేర్నాంబట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పది మందికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నతాస్పత్రికి తరలించారు. బోల్తాపడ్డ బస్సును క్రేన్ సాయంతో పక్కకు తీసి ట్రాఫిక్ పునరుద్ధరించారు. డ్రైవర్ చాకచక్యంతో బస్సును లోయ వైపునకు వెళ్లనీయకుండా నియంత్రించడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రధాని నోట.. శ్రీసిటీ ప్రగతి మాట

శ్రీసిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రధాని మోదీ ప్రశంసించారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... శ్రీసిటీ పారిశ్రామిక నగరం వల్ల ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రస్తావించారు. పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం తమ లక్ష్యం అన్నారు. ఇప్పటికే శ్రీసిటీ రూపంలో ఏపీ తయారీ రంగం ఊపందుకుందని వివరించారు. కేంద్ర పీఎల్ఐ, ఇతర పథకాలు వినియోగించుకుని మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు ప్రతిబింబంగా అంతర్జాతీయ కీర్తి గడించి, సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న శ్రీసిటీకి ప్రధాని కితాబు దక్కడం అభినందనీయం.

వైకుంఠ ఏకాదశి ఎఫెక్ట్... విమానాశ్రయానికి వీఐపీల తాకిడి

రేణిగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుపతి విమానాశ్రయానికి వీఐపీల తాకిడి అధికమైంది. తిరుమలలో పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మంత్రులతోపాటు వీఐపీల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు , తెలంగాణ మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్‌లు శ్రీవారి దర్శనానికి రానున్నట్లు సమాచార శాఖ అధికారులు తెలిపారు.

జోరుగా తాటాకుల విక్రయాలు



పెరంబూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాటాకాల విక్రయాలు జోరందుకున్నాయి. పొంగల్ పండుగ ముందు రోజున భోగీ మంటలు వేయనున్నారు. తాటాకులతో మంటలు వేసి, వాటి మధ్యలో కుండలో బియ్యం ఉంచి పొంగళ్లు పెట్టి ఇంటిల్లిపాదీ ఆనందిస్తుంటారు. భోగీ మంటల్లో వేసేందుకు తాటాకులు సిద్ధమయ్యాయి. పండుగకు ఇంకా ఐదు రోజులే ఉన్న నేపథ్యంలో, తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి సహా పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన తాటాకులు విక్రయిస్తున్నారు. ఒక తాటాకు రూ.30, ఐదు తాటాకులు రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రజలు తమ ఆర్థికస్థితిని బట్టి తాటాకులు కొనుగోలు చేస్తున్నారు.